# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387



PUBLISHED: HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :14 | సోమవారం 15 జూన్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-


## కృష్ణా పడవ ప్రమాదంపై

# సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం

పడవ ప్రమాదంపై సీఎం సమీక్ష..

సమగ్ర విచారణకు ఆదేశం

కోనూరు ఘటనపై ప్రభుత్వం స్పందన.. భద్రతా చర్యలు కట్టుదిట్టం

కృష్ణానది విషాదం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

పడవ ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు



అమరావతి, జూన్ 14(తెలుగు గళం): పల్నాడు జిల్లా కోనూరు సమీపంలో కృష్ణానదిలో జరిగిన పడవ ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ ఘటన వివరాలను తెలుసుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం, ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు.

2 లో

## 'మళ్లీ మంచి రోజులు వస్తాయి'..

### కూటమి ప్రభుత్వంపై సజ్జల విమర్శలు



అమరావతి, జూన్ 14(తెలుగు గళం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులు శాశ్వతం కావని, భవిష్యత్తులో మళ్లీ అనుకూల పరిస్థితులు వస్తాయని ఆయన అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సజ్జల, ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను బలంగా ప్రస్తావిస్తున్న పార్టీగా వైఎస్సార్ కాంగ్రెస్ కొనసాగుతోందని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తున్నారని చెప్పారు.

2 లో

## మంత్రి పదవులపై ఆశ లేదు..

## విద్యా సంస్కరణలే మా లక్ష్యం

### సోనామ్ వాంగ్‌చుక్ కీలక వ్యాఖ్యలు..



హైదరాబాద్, జూన్ 14(తెలుగు గళం): విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం, యువతలో చైతన్యం పెంపొందించడమే తమ లక్ష్యమని ప్రముఖ సామాజిక, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పేర్కొన్నారు. అధికార పదవులు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం తాము పనిచేయడం లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, యువత దేశ భవిష్యత్తును నిర్మించే శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు.

2 లో

## 'అన్ని పనులు కేంద్ర మంత్రులే చేస్తే..

# సీఎం ఎందుకు?'



హైదరాబాద్, జూన్ 14 (తెలుగు గళం): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్నారని ఆయన ఆరోపించారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పాల్గొన్న రామచందర్ రావు, ధాన్యం కొనుగోలు అంశంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.

2 లో

# 'రేవంత్ ప్రభుత్వానికి ఇంటర్వెల్..

## ఫస్ట్ హాఫ్ డిజాస్టర్'

కాంగ్రెస్ హామీలు అమలు కాలేదు:

'ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారు'

ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల వెల్లువ

హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని కేటీఆర్ ఆరోపణ



హైదరాబాద్, జూన్ 14(తెలుగు గళం): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటూ, "రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇంటర్వెల్ పడిపోయింది.. ఫస్ట్ హాఫ్ డిజాస్టర్" అని విమర్శించారు.

2 లో

## ఇంత నీచమైన ప్రచారమా

### జగన్‌పై అచ్చెన్నాయుడు విమర్శలు



అమరావతి, జూన్ 14(తెలుగు గళం): డీఎస్సీ నియామక ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. నియామకాలపై నిరాధార ప్రచారం చేయడం ద్వారా అభ్యర్థులను, ఉపాధ్యాయ వ్యవస్థను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు.

డీఎస్సీ వ్యవహారంపై మాట్లాడుతూ, నియామక ప్రక్రియకు సంబంధించి గతంలో దాఖలైన పలు వ్యాజ్యాలను న్యాయస్థానాలు కొట్టివేశాయని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

2 లో

# ప్రభుత్వ విద్యార్థులకు

# కార్పొరేట్ తరహా స్కూల్ కిట్లు

27 లక్షల మంది విద్యార్థులకు కొత్త స్కూల్ కిట్లు

ప్రభుత్వ విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు..పూర్తి కిట్లు

రూ.687.78 కోట్లతో విద్యార్థులకు సమగ్ర స్కూల్ కిట్

ప్రభుత్వ స్కూళ్లలో కొత్త రూపు.. నాణ్యతకు పెద్దపీట

ఒకే విధానంలో స్కూల్ కిట్లు.. రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ

విద్యార్థులకు కార్పొరేట్ తరహా సదుపాయాలు..

ప్రభుత్వ ప్రత్యేక ప్రణాళిక



హైదరాబాద్, జూన్ 14(తెలుగు గళం): ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి నాణ్యమైన యూనిఫాంలు, స్కూల్ కిట్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టింది. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సుమారు రూ.687.78 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాదరక్షలు, సాక్సులు, బ్యాగులు తదితర అవసరమైన సామగ్రిని అందించనున్నారు. గురుకులాలు, ప్రత్యేక నివాస పాఠశాలల విద్యార్థులకు అదనంగా బెడ్డింగ్ సామగ్రి, ట్రంక్ బాక్స్, ప్లేటు, గ్లాస్, కటోరా, పీటీ డ్రెస్, ట్రాక్‌సూట్, నైట్ డ్రెస్ వంటి పూర్తి కిట్‌ను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

ఈసారి యూనిఫాంల తయారీలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వస్త్రాల కొనుగోలు నుంచి కుట్టు పనుల వరకు ప్రతి దశలో ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థుల కోసం అవసరమైన కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రముఖ సంస్థలతో పాటు తెలంగాణ చేనేత సంస్థల ద్వారా సమకూరుస్తున్నారు.

విద్యార్థులకు అందించే యూనిఫాంల రంగుల్లో కూడా మార్పులు చేశారు. డే స్కాలర్లకు లైట్ బ్లూ--డార్క్ బ్లూ కలయికలో యూనిఫాంలు ఉండగా, గురుకుల విద్యార్థులకు ప్రత్యేక రంగుల నమూనాలు సిద్ధం చేశారు. విద్యార్థినుల కోసం ప్రత్యేక డిజైన్‌లతో దుస్తులు అందించనున్నారు.

యూనిఫాంల కుట్టు బాధ్యతను రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఈ నిర్ణయంతో వేలాది మహిళలకు ఉపాధి లభించడంతో పాటు సంఘాలకు గణనీయమైన ఆదాయం సమకూరనుంది.


అన్ని విద్యా శాఖలు, గురుకుల సంస్థలకు అవసరమైన సామగ్రిని ఈసారి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా ఒకే విధంగా కొనుగోలు చేసి పంపిణీ చేయనున్నారు. దీనివల్ల నాణ్యతలో ఏకరీతి, పారదర్శకత, సమయానికి సరఫరా వంటి అంశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకులాల్లోని విద్యార్థులకు బూట్లు, సాక్సులు, బెల్టులు, టైలు, బ్యాగులు అందించనుండగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కూడా తొలిసారిగా బ్యాగులు, బూట్లు, బెల్టులు, టైలు, సాక్సులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

2 లో

## ప్రభుత్వ వైద్య రంగంలోకి

# ఏఐ సేవలు




హైదరాబాద్, జూన్ 14(తెలుగు గళం): ప్రభుత్వ వైద్య సేవలను మరింత ఆధునికీకరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. త్వరలోనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి, కృత్రిమ మేధస్సు వైద్యులకు ప్రత్యామ్నాయం కాదని, వారి నిర్ణయ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే సాధనమని అన్నారు.

2 లో

## చరిత్ర--భవిష్యత్తుకు

# వారధిగా హైదరాబాద్

సలార్ జంగ్ మ్యూజియం చుట్టూ హెరిటేజ్ సర్క్యూట్

చరిత్రను కాపాడుతూ.. భవిష్యత్తును నిర్మిస్తున్న హైదరాబాద్

వారసత్వానికి కొత్త ఊపు.. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక




హైదరాబాద్, జూన్ 14(తెలుగు గళం): చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి వైపు దూసుకెళుతున్న నగరంగా హైదరాబాద్ నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నగరాన్ని కేవలం భవనాలు, రహదారులు మాత్రమే కాకుండా, చరిత్రను నిలబెట్టే సాంస్కృతిక సంస్థలు కూడా నిర్మిస్తాయని ఆయన అన్నారు.

2 లో

# ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ తరహా స్కూల్ కిట్లు

మొదటి పేజీ తరువాయి

యూనిఫాంలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు వంటి ఆర్డర్లలో గణనీయమైన భాగాన్ని తెలంగాణ చేనేత సహకార సంస్థలకు కేటాయించడం ద్వారా చేనేత రంగానికి ప్రోత్సాహం లభించనుంది. టైలు, బెల్టులు, ఐడీ కార్డుల తయారీ బాధ్యతలను ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించడం ద్వారా స్థానిక పరిశ్రమలకు కూడా ఊతం లభించనుంది.

ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టుబడిగా భావిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని అర్హులైన విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కిట్లు అందేలా చర్యలు చేపడుతోంది.

# “మంత్రి పదవులపై ఆశ లేదు.. విద్యా సంస్కరణలే మా లక్ష్యం”

మొదటి పేజీ తరువాయి

ప్రజల్లో అవగాహన పెంచడం, విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను వెలుగులోకి తేవడం కోసం చేపడుతున్న కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.


దేశవ్యాప్తంగా తరచూ వెలుగుచూస్తున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దు వంటి సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసిన వాంగ్‌చుక్, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవస్థలో లోపాలు చోటుచేసుకున్నప్పుడు బాధ్యులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని అభిప్రాయపడ్డారు.

విద్యను కేవలం పరీక్షలు, మార్కులకే పరిమితం చేయకుండా, విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించే దిశగా సంస్కరణలు అవసరమని ఆయన సూచించారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు సమగ్ర మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణపై కూడా మాట్లాడిన ఆయన, రాబోయే తరాలకు నాణ్యమైన విద్య ఎంత ముఖ్యమో, స్వచ్ఛమైన గాలి, నీరు కూడా అంతే అవసరమని అన్నారు. సహజ వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం పౌర సమాజం చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించిన వాంగ్‌చుక్, అభివృద్ధి పేరుతో ప్రకృతి సంపదను నష్టపరచకుండా సమతుల్య విధానాలు అవలంబించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు విద్య, పర్యావరణ రంగాల్లో దీర్ఘకాలిక దృష్టితో నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ వైద్య రంగంలోకి ఏఐ సేవలు




హైదరాబాద్, జూన్ 14(తెలుగు గళం): ప్రభుత్వ వైద్య సేవలను మరింత ఆధునికీకరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. త్వరలోనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి, కృత్రిమ మేధస్సు వైద్యులకు ప్రత్యామ్నాయం కాదని, వారి నిర్ణయ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే సాధనమని అన్నారు.

ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించడం, చికిత్సను వేగవంతం చేయడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో ఇప్పటికే ఎక్స్‌రే చిత్రాల విశ్లేషణతో పాటు సెప్సిస్, ఫ్యాటీ లివర్ వంటి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే సాంకేతికతలను వినియోగిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సేవలను క్రమంగా మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు విస్తరించనున్నట్లు చెప్పారు.

భవిష్యత్ వైద్యులను సాంకేతిక మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సిమ్యులేషన్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక వైద్య విద్యతో పాటు డిజిటల్ నైపుణ్యాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

ఫార్మా, బయోటెక్నాలజీ, వ్యాక్సీన్ తయారీ, వైద్య పరిశోధన రంగాల్లో ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్, రాబోయే రోజుల్లో ఏఐ ఆధారిత ఆరోగ్య పరిష్కారాల కేంద్రంగా కూడా ఎదిగే అవకాశాలు ఉన్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు.

సదస్సులో దేశ, విదేశాల వైద్య నిపుణులు, పరిశోధకులు, సాంకేతిక రంగ ప్రతినిధులు, వైద్య విద్యార్థులు, ఆరోగ్య రంగ నిపుణులు పాల్గొని ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై అభిప్రాయాలు పంచుకున్నారు.

# ఇంత నీచమైన ప్రచారమా

మొదటి పేజీ తరువాయి

ప్రశ్నాపత్రాల లీకేజీ, మెరిట్ జాబితా, స్పోర్ట్స్ కోటా, రిజర్వేషన్లపై వచ్చిన ఆరోపణలకు అధికారులు ఇప్పటికే వివరణ ఇచ్చారని అన్నారు. డీఎస్సీ నియామకాల్లో కుల ప్రాతిపదికన అన్యాయం జరిగిందన్న ఆరోపణలను కూడా మంత్రి తిరస్కరించారు. గణాంకాలు పరిశీలిస్తే ప్రచారంలో ఉన్న ఆరోపణలకు వాస్తవ ఆధారాలు లేవని ఆయన పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాల కంటే వాస్తవాల ఆధారంగా రాజకీయాలు చేయాలని సూచించారు. తప్పుడు ప్రచారంతో యువతను, ఉద్యోగార్థులను గందరగోళానికి గురిచేయడం సరికాదని అన్నారు.

డీఎస్సీ నియామక ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని ప్రభుత్వం స్పష్టం చేస్తోందని, అర్హత ఆధారంగానే నియామకాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

# కృష్ణా పడవ ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

మొదటి పేజీ తరువాయి

అధికారుల సమాచారం ప్రకారం, నదిలో ప్రయాణిస్తున్న పడవ ఇసుక దిబ్బను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ఈ సాయాన్ని తక్షణమే అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలను ఆసుపత్రికి తరలించి, అవసరమైన ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఘటనకు దారితీసిన కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, సాగునీటి శాఖల అధికారులతో కూడిన బృందం ద్వారా సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని సూచించారు.

భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నదీ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని, పడవల నిర్వహణ, ప్రయాణికుల రక్షణకు అవసరమైన చర్యలను అమలు చేయాలని అధికారులకు సీఎం సూచించారు.

సహాయక చర్యలు, బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# ‘అన్ని పనులు కేంద్ర మంత్రులే చేస్తే.. సీఎం ఎందుకు?’

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్నారని ఆయన ఆరోపించారు.

అంబర్‌పేట్ నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పాల్గొన్న రామచందర్ రావు, ధాన్యం కొనుగోలు అంశంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. అయితే ఆ కార్యక్రమాలకు సంబంధించిన గుర్తింపును రాష్ట్ర ప్రభుత్వం తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు.

కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల సహకారంపై ఆధారపడుతున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. “అన్ని పనులు కేంద్ర మంత్రులు, ఎంపీలే చేస్తే.. ముఖ్యమంత్రి పాత్ర ఏమిటి?” అని ప్రశ్నించారు.

హైదరాబాద్‌లో ఇటీవల కురిసిన వర్షాల అనంతరం ఏర్పడిన పరిస్థితులను ప్రస్తావిస్తూ, నగర మౌలిక సదుపాయాల నిర్వహణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. నగర అభివృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కూడా స్పందించిన ఆయన, ముందుగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల ప్రస్తుత సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు.

రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుతూ, బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలపై విమర్శలు గుప్పించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అలాగే కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అందించిన నిధులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని రామచందర్ రావు సవాల్ విసిరారు.

# చరిత్ర--భవిష్యత్తుకు వారధిగా హైదరాబాద్




హైదరాబాద్, జూన్ 14(తెలుగు గళం):: చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి వైపు దూసుకెళ్తున్న నగరంగా హైదరాబాద్ నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నగరాన్ని కేవలం భవనాలు, రహదారులు మాత్రమే కాకుండా, చరిత్రను నిలబెట్టే సాంస్కృతిక సంస్థలు కూడా నిర్మిస్తాయని ఆయన అన్నారు. సలార్ జంగ్ మ్యూజియం నగర వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు.

సలార్ జంగ్ మ్యూజియం 75వ వార్షికోత్సవం, సలార్ జంగ్--3 జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క, ప్రపంచ నలుమూలల నుంచి వేలాది కళాఖండాలను సేకరించి ప్రజలకు అందుబాటులో ఉంచడం సలార్ జంగ్--3 దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. వివిధ మతాలు, సంస్కృతులు, నాగరికతలకు చెందిన అరుదైన కళాఖండాలు ఒకే చోట ఉండటం ఈ మ్యూజియం ప్రత్యేకత అని వివరించారు.

మూసి నదిని ఆధునిక రివర్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేసి, దానిని సలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్‌షాహీ సమాధులు, చౌమహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్ వంటి వారసత్వ ప్రదేశాలతో అనుసంధానించే సమగ్ర ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి ద్వారా దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు స్థానిక ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన చెప్పారు.

హైదరాబాద్ చరిత్రకే పరిమితమైన నగరం కాదని, ఐటీ, బయోటెక్నాలజీ, ఫార్మా వంటి ఆధునిక రంగాల్లో కూడా అంతర్జాతీయ గుర్తింపు పొందిందని భట్టి అన్నారు. వారసత్వాన్ని పరిరక్షిస్తూ సాంకేతిక అభివృద్ధిని సమన్వయం చేయడం నగర ప్రత్యేకతగా అభివర్ణించారు.

రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి కనీసం ఒక్కసారైనా సలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసి మ్యూజియంలను విద్యా, పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అలాగే వ్యాపార, పెట్టుబడి అవసరాల కోసం హైదరాబాద్‌కు వచ్చే విదేశీ ప్రతినిధులు నగర చారిత్రక వారసత్వాన్ని కూడా అనుభవించేలా ప్రత్యేక పర్యాటక కార్యక్రమాలను రూపొందిస్తామని తెలిపారు. నైట్ టూరిజం, బహుభాషా గైడెడ్ వాక్స్, మెరుగైన రవాణా సౌకర్యాలతో ఓల్డ్ సిటీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

మ్యూజియాన్ని దశాబ్దాలుగా సంరక్షిస్తున్న క్యూరేటర్లు, సిబ్బంది, భద్రతా సిబ్బంది సేవలను ఈ సందర్భంగా భట్టి ప్రశంసించారు. సలార్ జంగ్--3 సేకరించిన వారసత్వ సంపదను మరింత ఆధునికంగా సంరక్షించి భావితరాలకు అందించడం అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# ‘మళ్లీ మంచి రోజులు వస్తాయి’..

మొదటి పేజీ తరువాయి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అన్ని వర్గాల అర్హులైన లబ్ధిదారులకు అందించామని సజ్జల పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలతో పాటు ఇతర అర్హులకూ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో శాంతి భద్రతలు, వ్యాపార అనుకూల వాతావరణం మెరుగ్గా ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు.

విద్య, వైద్య రంగాల్లో గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించిన సజ్జల, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని అన్నారు. ఆ కార్యక్రమాల గురించి ప్రజలకు మరింత విస్తృతంగా వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా స్పందించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అమరావతి అభివృద్ధి పేరుతో భారీ ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆరోపించారు.

పార్టీ కార్యకర్తలు ప్రజలతో మరింత మమేకమై పార్టీ విధానాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సజ్జల పిలుపునిచ్చారు. సమన్వయంతో పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# నిరుద్యోగ యువత ఆశలు నిజం చేస్తాం.. ‘వార్షిక-2025’ పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం



న్యూస్ డెస్క్ ,జూన్ 14(తెలుగు గళం): నిరుద్యోగ యువత ఆశలకు అనుగుణంగానే ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం వరుస నోటిఫికేషన్లు జారీ చేయబోతోందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ప్రచురించిన పోటీ పరీక్షల ప్రత్యేక పుస్తకం ‘వార్షిక 2025’ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించిన బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ యువతను విజేతలుగా నిలిపేందుకు, ‘మేధో తెలంగాణ’ సాధన దిశగా ప్రభుత్వం ఉచిత శిక్షణతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తెస్తోందన్నారు. పోటీ పరీక్షల్లో 20 నుంచి 25 శాతం ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ నుంచే వస్తున్నందున, అభ్యర్థుల సౌకర్యార్థం జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలతో కూడిన ‘వార్షిక 2025’ పుస్తకాన్ని బీసీ స్టడీ సర్కిల్ రూపొందించిందని చెప్పారు.

ఈ పుస్తకంలో కరెంట్ అఫైర్స్‌తో పాటు ఎండోమెంట్స్ ఉద్యోగాల కోసం ప్రత్యేకంగా ‘భారతీయ వైదిక హైందవ విజ్ఞానం’ అంశాన్ని, అలాగే జనరల్ నాలెడ్జ్, రాజ్యాంగం, చరిత్ర, భౌగోళిక శాస్త్రం, తెలంగాణ ఉద్యమం వంటి ముఖ్యమైన సమాచారాన్ని పొందుపరిచినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్, పోలీస్, రైల్వే, ఉపాధ్యాయ ఉద్యోగాలకు ప్రభుత్వం ఉచితంగా అన్ని సౌకర్యాలతో శిక్షణ ఇస్తోందని, యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ‘రేవంత్ ప్రభుత్వానికి ఇంటర్వెల్.. ఫస్ట్ హాఫ్ డిజాస్టర్’

మొదటి పేజీ తరువాయి

ఖైరతాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పనితీరును ప్రజలు ఇప్పటికే అంచనా వేసేశారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఉద్యోగాల కల్పన, సంక్షేమ హామీలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని ఆరోపించారు.

హైదరాబాద్ అభివృద్ధిపై స్పందించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త గృహ నిర్మాణాల విషయంలో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కొన్ని కార్యక్రమాల కొనసాగింపులో కూడా స్పష్టత లేదని అన్నారు. ప్రజలకు అందాల్సిన పలు ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపించారు.

యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల అంచనాలకు అనుగుణంగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అలాగే రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపైనా వ్యాఖ్యలు చేశారు.



రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాల పేర్ల మార్పుపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాలకు కొత్త పేర్లు పెట్టడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు.

ఖైరతాబాద్‌లో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని కార్యకర్తలకు సూచించిన కేటీఆర్, ప్రతి నాయకుడు తన పరిధిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని కోరారు. సమన్వయంతో పనిచేస్తే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు విజయావకాశాలు మెరుగవుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ముల్లాయిజం -- ఒక జాతిని పతనానికి నెడుతున్న శాపం

**-ఎం.ఎ జైనుల్ ఆబదీన్**

**(అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ సౌత్ ఇండియా ప్రచార కార్యవర్గ సభ్యులు)**



ఒక దేశం లేదా జాతి ఎదుర్కొంటున్న సంక్షోభాలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక కారణాలు అనేకం ఉండవచ్చు. అయితే ఆ దేశ ప్రజల నైతిక స్థితి, దేవుని పట్ల భయం, మానవత్వం మరియు పరస్పర గౌరవం క్షీణించినప్పుడు ఆ సంక్షోభాలు మరింత తీవ్రమవుతాయి.హృదయాలలో నుండి దేవుని భయం తొలగిపోయినప్పుడు, అన్ని రకాల ఆధ్యాత్మిక, సామాజిక మరియు నైతిక వ్యాధులు పుట్టుకొస్తాయి.నేడు పాకిస్తాన్ ఎదుర్కొంటున్న పరిస్థితిని పరిశీలిస్తే ఈ వాస్తవం స్పష్టంగా కనిపిస్తుంది.ఒకప్పుడు ఇస్లాం పేరుతో స్థాపించబడిన దేశంగా ప్రపంచ ముస్లింల ఆశలను చూరగొన్న పాకిస్తాన్, నేడు అంతర్గత విభేదాలు, తీవ్రవాదం, అవినీతి, ఆర్థిక సంక్షోభం, మతపరమైన అసహనం మరియు సామాజిక అశాంతితో సతమతమవుతోంది. ఈ పరిస్థితికి రాజకీయ నాయకత్వ వైఫల్యాలు ఎంత కారణమో, మతం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ముల్లాయిజం కూడా అంతే కారణమని చెప్పడంలో అతిశయోక్తి లేదు.ఇస్లాం శాంతి, ప్రేమ, న్యాయం, సహనం మరియు సోదరభావాన్ని బోధిస్తుంది. ఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధనలు మానవాళి సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకున్నవి. కానీ దురదృష్టవశాత్తు కొందరు మత నాయకులు ఈ పవిత్ర బోధనలను పక్కనపెట్టి మతాన్ని తమ అధికారం, ప్రభావం మరియు స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించారు.ఫలితంగా ప్రజలలో ఐక్యత పెరగాల్సిన చోట విభజనలు పెరిగాయి.ప్రేమ పెరగాల్సిన చోట ద్వేషం పెరిగింది. సహనం పెరగాల్సిన చోట అసహనం వ్యాపించింది.ముల్లాయిజం యొక్క అత్యంత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే, అది మతాన్ని ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం నుండి రాజకీయ, సామాజిక ఆధిపత్య సాధనంగా మార్చడం. ఇస్లాం పేరుతో ఇతర ముస్లింలను కాఫిర్‌లుగా ప్రకటించడం, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, హింసకు ప్రోత్సాహం ఇవ్వడం, ప్రజలను భయపెట్టడం వంటి చర్యలు సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి.ఇలాంటి పరిస్థితుల్లో యువత మతం పట్ల విశ్వాసాన్ని కోల్పోవడమే కాకుండా, సమాజం మొత్తం నైతిక పతనానికి గురవుతుంది.నేడు పాకిస్తాన్‌లో జరుగుతున్న అనేక సంఘటనలు ఈ వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నాయి.మసీదులు కూడా సురక్షితంగా లేని పరిస్థితులు ఏర్పడ్డాయి.ఒక వర్గం మరో వర్గంపై దాడులు చేయడం, మతం పేరుతో హత్యలు జరగడం, అమాయక ప్రజలు హింసకు గురికావడం వంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి.ఇది ఇస్లాం యొక్క అసలు బోధనలకు పూర్తిగా విరుద్ధం. ఎందుకంటే ఇస్లాం ఒక నిరపరాధిని హత్య చేయడాన్ని మొత్తం మానవజాతిని హత్య చేసినంతటి ఘోర నేరంగా పేర్కొంటుంది.అదేవిధంగా, దేశంలో అవినీతి, అసత్య ప్రచారం, అన్యాయం, నిర్లక్ష్యం మరియు స్వార్థ రాజకీయాలు పెరిగిపోవడం కూడా ఆందోళనకర విషయం. ప్రజల నైతిక విలువలు క్షీణించినప్పుడు సమాజం మొత్తం ప్రభావితమవుతుంది.చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా, ప్రజల హృదయాలలో దేవుని భయం లేకపోతే వాటి ప్రభావం పరిమితంగానే ఉంటుంది. నిజమైన సంస్కరణ హృదయాలలో ప్రారంభం కావాలి.

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది.నిజంగా మత నాయకులు ఇస్లాం పట్ల ప్రేమ కలిగి ఉంటే, ఇస్లాం పేరుతో జరుగుతున్న ఈ హింస, విద్వేషం, అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ప్రజలను ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దాల్సిన వారు ఎందుకు రాజకీయ ఆధిపత్యం కోసం పోటీ పడుతున్నారు? మతాన్ని ప్రజల ఐక్యతకు కాకుండా విభజనకు ఎందుకు ఉపయోగిస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.ఈ పరిస్థితి నుండి బయటపడాలంటే ప్రజలు మతం యొక్క అసలు సందేశాన్ని అర్థం చేసుకోవాలి. ఖుర్ఆన్ బోధించే న్యాయం, కరుణ, సహనం మరియు మానవత్వాన్ని తమ జీవితాలలో ఆచరించాలి.మతం పేరుతో ద్వేషాన్ని వ్యాప్తి చేసే వారిని తిరస్కరించాలి.సమాజంలో విద్య, నైతిక విలువలు మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించాలి.ముఖ్యంగా యువత విమర్శనాత్మక ఆలోచనతో మతాన్ని అధ్యయనం చేసి, అంధ విశ్వాసాలకు బానిసలు కాకూడదు.నేడు పాకిస్తాన్‌కే కాదు, ప్రపంచంలోని ప్రతి ముస్లిం సమాజానికి ఈ సందేశం వర్తిస్తుంది. మతం పేరుతో ద్వేషం కాదు, ప్రేమ అవసరం. హింస కాదు, శాంతి అవసరం. విభజన కాదు, ఐక్యత అవసరం. ముల్లాయిజం అనే శాపం నుండి విముక్తి పొంది, ఇస్లాం యొక్క నిజమైన విలువలను ఆచరించినప్పుడే సమాజంలో శాంతి, అభివృద్ధి మరియు స్థిరత్వం నెలకొంటాయి.ఒక జాతి భవిష్యత్తు దాని ఆయుధాలలో కాదు, దాని ప్రజల హృదయాలలో ఉంటుంది. ఆ హృదయాలలో దేవుని భయం, నైతికత మరియు మానవత్వం ఉన్నప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుంది.

# సోంపల్లి ఇసుక ర్యాంపు వద్ద ప్రమాదం..

## బ్లూ కోల్ట్ సిబ్బందికి గాయాలు

**బూర్గంపాడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా। తెలుగు గళం న్యూస్**



సోంపల్లి ఇసుక ర్యాంపు వద్ద లారీల రాకపోకలను గ్రామస్తులు అడ్డుకుంటున్నారనే సమాచారం అందడంతో బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన బ్లూ కోల్ట్ సిబ్బంది మంగీలాల్, శ్రీనివాసరావులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి పరిస్థితిని సర్దిచెప్పి లారీలను పంపించిన అనంతరం వారు తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో దోమల వాగు నుంచి బయటకు వస్తుండగా, AP16TJ 3569 నంబర్ గల లారీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ముందుగా వెళ్తున్న బ్లూ కోల్ట్ సిబ్బంది బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డ్ శ్రీనివాసరావులకు గాయాలయ్యాయి.

ప్రమాదం కారణంగా బైక్‌తో పాటు పోలీసు సిబ్బంది వినియోగిస్తున్న రెండు ట్యాబ్‌లు కూడా ధ్వంసమయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

# నేడు కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్న నేదురుమల్లి



**ఉమ్మడి నెల్లూరుజిల్లా వెంకటగిరి(తెలుగు గళం):**-నేడు అనగా 15-06-2026వతేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకి ,నేదురుమల్లి కుటుంభం అభిమానులకు అందుబాటులో ఉండనున్నారు అని వెంకటగిరి వైస్సార్ కాంగ్రెస్ కార్యాలయం నుండి ప్రకటనలో తెలిపారు.

# మోడలింగ్ రంగంలో ఎన్నో అవకాశాలు

## ప్రేక్షకులను అలరించిన స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో



**రాజమండ్రి (తెలుగు గళం )జూన్ 14:** మోడలింగ్ రంగంలో రాణించిన వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో నిర్వాహకులు నవీన్ అన్నారు. ఏవీ అప్పారావు రోడ్ లోని ప్రసాద్ ఐ మాక్స్ థియేటర్స్ లో ఏర్పాటు చేసిన స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో ప్రేక్షకులను అలరించింది. గతవారం లాలా చెరువు,హైవే రోడ్డులో ఉన్న ప్రకృతి వేదిక లో నిర్వహించిన ఫ్యాషన్ షోలో గెలుపొందిన విజేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని క్యాట్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ దీప్, బిందు, ప్రియాంక , సంతోష్ కుమార్ మాట్లాడుతూ పోస్టర్ ఆవిష్కరణ దగ్గర నుంచి ఫ్యాషన్స్ నిర్వహించే వరకు ప్రకృతి వేదిక నిర్వాహకులు జీవి శ్రీరాజ్ కు ,ఐమాక్స్ థియేటర్ నిర్వాహకులు కు కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యాషన్ షో లలో పాల్గొనడం వలన టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్ లలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ షోలో గెలుపొందిన స్రవంతి మాట్లాడుతూ పెళ్లయిన తాను ఫ్యాషన్ షోలో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగిందని అన్నారు. అందం, టాలెంట్ ఉండడం వల్ల ఫ్యాషన్ రంగంలో అనేక అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

# ఎన్టిఏని రద్దు చేయాలి



**-ప్రొ. ఆర్.లింబాద్రి**

**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, జూన్ 14**

ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ) నుంచి తొలగించి, పార్లమెంటుకు జవాబుదారీగా ఉండే స్వతంత్ర సంస్థకు అప్పగించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి డిమాండ్ చేశారు.రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వెబినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రవేశ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలను ప్రస్తావిస్తూ, 2024లో నిపుణులు చేసిన 101కిపైగా సూచనలను 2026 పరీక్షల నిర్వహణలో అమలు చేయలేదని విమర్శించారు.విద్యను వ్యాపారీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు దూరమవుతున్నాయని, కోచింగ్ సెంటర్ల ఆధిపత్యం పెరుగుతోందని అన్నారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్టు సిబ్బందిని వినియోగించడం ఆందోళనకరమని పేర్కొన్నారు.రూ. 2,000 వరకు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, కనీస సీసీటీవీ సదుపాయాలు లేని కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం బాధాకరమన్నారు.ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా ఏర్పాట్లలో మరింత జాగ్రత్తలు అవసరమని సూచించారు.కంప్యూటర్ ఆధారిత పరీక్షలతో పాటు విద్యార్థులపై ఒత్తిడి తగ్గించే విధంగా సంవత్సరంలో రెండు సార్లు పరీక్షలు నిర్వహించాలని సూచించారు.తల్లిదండ్రులు కూడా ఇంజనీరింగ్, వైద్య విద్యలకే పరిమితం కాకుండా ఇతర ఉన్నత విద్యా అవకాశాల వైపు విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు.1.35 లక్షల సీట్ల కోసం 23 లక్షలకు పైగా విద్యార్థులు పోటీపడుతున్న పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం అనుమతించరాదని, గత తప్పిదాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ విద్యా రంగంపై చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సంస్కరణలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు కె. ఉమామహేశ్వరరావు, రమేష్ బాబు, డి.ఏ.ఎస్.వి. ప్రసాద్, డీజీ నరసింహారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతానికి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలి

**-- కుంజా ధర్మా**



**భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , తెలుగు గళం న్యూస్ :**

భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి హాజరైన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ దేశంలో అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ అని పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త ఒక బాధ్యతను స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం పెంచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే కార్యక్రమాలు, సభ్యత్వ విస్తరణ, బూత్ స్థాయి నిర్మాణం మరియు పార్టీ సంస్థాగత బలోపేతంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మరియు ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని, SIR కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, భద్రాచలం పట్టణంలోని అధ్వానంగా ఉన్న డ్రైనేజీలు, వీధిలైట్లు, రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రధాన ఎజెండాగా సమావేశంలో తీర్మానించడమైనది. పార్టీలో కీలక బాధ్యతలు స్వీకరించిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా, బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ములిశెట్టి రాంమోహన్ రావులను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.



ఈ కార్యక్రమంలో బీజేపీ భద్రాచలం మండల ఇంచార్జ్ తాటి పాముల ఐలయ్య, మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, నాయకులు నిడదవోలు నాగబాబు, పి.సి. కేశవ్, ముత్యాల చంద్రశేఖర్, చెల్లుబోయిన వెంకన్న, ఆవుల సుబ్బారావు, అల్లాడి వెంకటేశ్వరరావు, దేవరపల్లి వెంకటేశ్వర్లు, అల్లాడి వెంకట సుబ్బారావు, శేర్ శ్రీనివాస్, గంగులకుర్తి రామాచారి, జి. వెంకటేశ్వర్లు, గార్లపాటి శ్రీనివాస్, అన్నం సాయి లక్ష్మణ్, మండల గురుసాయి, జె. ప్రభాకర్, లంకా విమల, కెల్లా అప్పారావు, సి.హెచ్. పాపయ్య, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సిరి ట్రావెల్స్ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి..

## కార్యాలయం ముందు మృతదేహంతో బంధువుల ధర్నా






**భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా। తెలుగు గళం న్యూస్**

భద్రాచలానికి చెందిన సిరి ట్రావెల్స్ డ్రైవర్ మల్లెల సత్యసాయి (27) ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మొండికుంట వద్ద చోటుచేసుకుంది.

సమాచారం మేరకు, సిరి ట్రావెల్స్‌కు చెందిన వాహనంలో ప్రయాణికులను మణుగూరు రైల్వే స్టేషన్ వద్ద దించి తిరిగి భద్రాచలం వస్తుండగా వాహనంలో డీజిల్ పూర్తిగా అయిపోయింది. దీంతో రోడ్డుపై వాహనాన్ని నిలిపివేసిన సత్యసాయి ఇంధనం తీసుకురావడానికి వెళ్లిన సమయంలో ఓ బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది.

ఈ ఘటనకు సిరి ట్రావెల్స్ యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని మృతుడి బంధువులు ఆరోపించారు. వాహనంలో సరిపడా ఇంధనం లేకుండా డ్రైవర్‌ను విధులకు పంపించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, తగిన పరిహారం అందించడంతో పాటు ఘటనకు పూర్తి బాధ్యత సిరి ట్రావెల్స్ యాజమాన్యం వహించాలని డిమాండ్ చేస్తూ బంధువులు భద్రాచలంలోని సిరి ట్రావెల్స్ కార్యాలయం ముందు మృతదేహంతో ధర్నా నిర్వహించారు.

ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



